క్లుప్తంగా

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపు కోసం క్వార్టర్ ఎలాట్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పీవీకాలనీలో నివాసయోగ్యం లేని క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఉద్యోగులకు ప్రత్యామ్నాయ క్వార్టర్లను కేటాయించేందుకు ఏరియా జీఎం రామచందర్ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ఎస్‌ఓటూ జీఎం డి.శ్యాంసుందర్ తెలిపారు. సీనియార్టీని పరిగణలోకి తీసుకుని ఎనిమిది మందికి క్వార్టర్స్‌ను కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

అశ్వాపురం: మండలంలో గంజాయి రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పలువురు అనుమానితుల ఇళ్లల్లో సోమవారం గంజాయి కోసం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ రీనాతో సోదాలు జరిపారు. గంజాయి ఎక్కడా దొరకలేదని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మండలంలో గంజాయి రవాణా, వినియోగంపై సమాచారం తెలిస్తే ఫోన్ నంబర్ 8712682093కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

మన్మోహన్ మరణం తీరని లోటు

మణుగూరురూరల్: భారత మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ ఉపాధ్యక్షుడు సి.త్యాగరాజన్, ప్రధాన కార్యదర్శి ఆర్.ఆల్బర్ట్‌లు అన్నారు. సోమవారం వారు మణుగూరు ఏరియాలో పర్యటించారు. ఏరియాలోని పీకేఓసీ- 2లో జరిగిన ఫిట్ సమావేశంలో మాట్లాడడమే కాకుండా మన్మోహన్ సింగ్ సంతాపసభలో పాల్గొన్నారు. తొలుత మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి వారు పూలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. పీకేఓసీ-2 మేనేజర్ రాంబాబు, సీఎంఓఏ ఏరియా అధ్యక్షుడు కల్యాణ్‌రామ్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, నాయకులు రాములు, బి.వెంకటేశ్వర్లు, బి.కృష్ణ, అబ్దుల్ రవూఫ్,మల్లికార్జున్,చేతన్, అజహర్, రాము, అభిలాష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ నాయకుడికి నివాళి

గుండాల: న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కమిటీ సభ్యుడు అజ్గర్ మరణంతో ఆ పార్టీ తీవ్ర శోక సంద్రంలో మునిగింది. ఆయన అకాల మృతివార్త తెలుసుకున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) శ్రేణులు అక్కడికి చేరుకుని తన భౌతిక కాయంపై పార్టీ జెండా, రెడ్ క్లాత్ కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ యాసారపు వెంకన్న అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, గుండాల మాజీ సర్పంచ్ కోరం సీతారాములు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) ఇల్లెందు డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్ లు మాట్లాడుతూ.. అజ్గర్ 1992 నుంచి న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ సభ్యుడిగా, గుండాల లోకల్ సెల్ కార్యదర్శిగా పనిచేస్తూ దివంగత ముక్తార్ పాషా అందించిన విప్లవస్ఫూర్తితో అంచలంచెలుగా ఎదిగాడని కొనియాడారు. సంతాప సభలో నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో గ్రామసభలు

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళికపై సోమవారం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని ఆసుపాక, నందిపాడు, తిరుమలకుంట, వినాయకపురం, గుమ్మడవల్లి, కోయ రంగాపురం, కొత్త మామిళ్లవారిగూడెం, రెడ్డిగూడెం, నారాయణపురం, అశ్వారావుపేట తోపాటు అన్నీ జీపీల్లో ఈ గ్రామసభలను నిర్వహించారు. ఈ సభల్లో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, అభివృద్ధి గురించి చర్చించారు. కాగా, గ్రామసభల్లో గ్రామస్తులు పలు సమస్యలపై వినతి పత్రాలను అందించారు. సభల్లో ఎంపీఓ సోయం ప్రసాద్, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, మోతీలాల్, సబిత, బాబు, అలివేలు, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు కొట్టె పిచ్చమ్మ ఇటీవల మృతి చెందింది. దశ దినకర్మలకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మొండికుంట, మల్లెలమడుగు, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు రూ.8500 సోమవారం పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గం బాలనర్సయ్య చేతుల మీదుగా మృతురాలి కుటుంబానికి అందజేశారు. సీపీఎం నాయకులు పినికేసి సుధాకర్‌రెడ్డి, ఆవుల సుధాకర్, మంగి వెంకటరమణ, సింగం సత్యనారాయణ, గొడుగు వెంకన్న, స్వర్గం వీరరాఘవులు, వేల్పుల వీరరాఘవులు, బొల్లం అయిలయ్య, దండి రాములు, బొడ్డు రాములు, బొమ్మరాతి రామయ్య, వెంకన్న, శంభిరెడ్డి, అశోక్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

న్యూఇయర్‌కు క్రేజీ కేక్స్ రెడీ!

- బేకరీల్లో అమ్మకానికి సిద్ధం
- లేటెస్ట్ డిజైన్లతో తళుకులు
- అన్ని ప్రాంతాల్లో మొదలైన సందడి


కూల్ కేకుల మోడళ్లు..


భద్రాచలంలోని ఓ బేకరీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల కేకులు

భద్రాచలంఅర్బన్: కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అంతా సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో న్యూ ఇయర్ అనగానే ముందుగా గుర్తుకొచ్చేది కేక్‌లు.. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన రంగుల్లో బేకరీ యజమానులు కేక్‌లు అందుబాటులో ఉంచారు. బొమ్మలతో పాటు సందేశాత్మకమైన కేక్‌లు రెడీ చేశారు. నూతన సంవత్సర వేళ కొత్త కొత్త వెరైటీలతో కేక్ లు సిద్ధం చేశారు. చూడగానే అందంగా.. తింటే రుచిగా.. కేకులను భద్రాచలం పట్టణంలో క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలకు బేకరీ నిర్వాహకులు సిద్ధం చేశారు.

నయా ట్రెండ్..

ప్రస్తుతం న్యూఇయర్ వేడుకలతో కేకులకు డిమాండ్ పెరిగింది. గతంలో ప్రత్యేక రోజుల్లోనే కేక్లకు డిమాండ్ ఉండేది. మారిన కాలాను కనుగుణంగా ఇప్పుడు ప్రతీ వేడుకల్లో కేక్‌ల వాడకం తప్పనిసరైంది. ట్రెండ్‌కు తగ్గట్టు భద్రాచలంలో కేకులు తయారు చేస్తున్నారు. క్రిస్మస్, కొత్త ఏడాది వేడుకల్లో వీటి వినియోగం ప్రత్యేకం. ప్రత్యేక ఫ్లేవర్స్‌లో క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల కోసం కేక్ మేకర్స్ అరకిలో బరువు మొదలుకుని 50 కిలోల వరకు వివిధ డిజైన్లలో కేకులు భద్రాచలం పట్టణంలోనే ట్రెండ్కు తగ్గట్టు తయారు చేశారు. సాధారణ కేకులు, కిలోకు రూ.250 మొదలుకొని రూ.500 వరకు, కూల్ కేక్స్ కిలోకు రూ.500 మొదలుకుని రూ.3,600 వరకు ధరలున్నాయి. భద్రాచలం పట్టణంలో కేక్‌ల వాడకం పెరగడంతో మాస్టర్స్ కూడా నిరంతరంగా ఉపాధి పొందుతున్నారు.

కొత్త డిజైన్లలో..

ప్రజలను ఆకట్టుకునే విధంగా బేకరీ మాస్టర్స్ కొత్త కొత్త డిజైన్లలో కేకులను తయారు చేస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్, జార్ఖండ్‌తో పాటు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మాస్టర్స్ పట్టణంలో బేకరీలు నిర్వహిస్తూ కేకుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. చిన్న పిల్లలను ఆకట్టుకునేలా క్రిస్మస్‌కు స్పెషల్ డిజైన్లు, న్యూ ఇయర్‌కు బటర్ ఫ్లై, బార్బీడాల్, హార్ట్ షేప్, మిక్కీమౌస్, బెన్టిన్ వంటి డిజైన్లలో తయారు చేస్తున్నారు. రాజకీయ పార్టీల రంగులతో, స్థానికంగా ఉన్న సంపన్నుల నుంచి సాధారణ కుటుంబాలు వినియోగించే రీతిలో ధరలకు అనుగుణంగా వందల రకాల్లో ఉంటున్నాయి.

సందడి షురూ..

భద్రాచలం పట్టణంలో వారం ముందుగానే న్యూ ఇయర్ వేడుకల జోష్ కనిపిస్తోంది. ఒకేసారి ఆర్డర్లు రావడంతో తయారీదారులు బిజీ అయ్యారు. భద్రాచలం పట్టణంలోని 10 కేక్ మేకింగ్ బేకరీలు ఉండగా వీటి నుంచి భద్రాచలం నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలాల తో పాటు పరిసర గ్రామాలకు కూడా స్టాకును సరఫరా చేస్తున్నారు. కొత్త ఏడాది వేడుకలు సమీపించడంతో కేకుల ఆర్డర్లతో బేకరీలు సందడిగా మారాయి. భద్రాచలం పట్టణంలో దాదాపు 10 బేకరీలు పట్టణంలో ఉన్న అన్ని ఏరియాల్లో విస్తరించాయి. వీటిలో పది నుంచి 15 మంది మాస్టర్స్‌తో సహా సుమారు 50 మంది వరకు సహాయకులు పనిచేస్తున్నారు.

గంటలోనే తయారు చేస్తాం..



కస్టమర్లు కోరిన డిజైన్లలో కేకులను కేవలం గంటలోపే తయారు చేస్తున్నాం. కేక్‌లపై జర్మన్ బ్లాక్ ఫారెస్ట్, బిస్కాఫ్, రస్మలై వంటి ఫ్లేవర్స్‌తో పాటు వివిధ రకాల డిజైన్లు వేయడం సొంతంగా నేర్చుకున్నా. డిసెంబర్ 31 కోసం కేకలు సిద్ధం చేశాం. ఆన్‌లైన్‌లో కనిపించే వెరైటీలను ఆర్డర్లను బట్టి తయారు చేసి ఇస్తున్నాం.

– కార్తీక్, బేకరీ మాస్టర్, భద్రాచలం

అన్ని వెరైటీల్లో..



కేకులను అన్ని వెరైటీల్లో అందిస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా భద్రాచలంలో చాలా వందలాది డిజైన్లలో కేకులు తయారు చేస్తున్నాం. కస్టమర్ల అభిరుచుల మేరకు అన్ని ఫ్లేవర్లలో కేక్స్ అందిస్తున్నాం. ప్రజల నుంచి మంచి ఆదరణ ఉంది. పేస్ట్రీలు (కూల్ కేక్స్), సాధారణ కేకులు, బ్రెడ్ కేక్స్ ఉన్నాయి.

– అజయ్, బేకరీ నిర్వాహకుడు, భద్రాచలం

నేటి నుంచి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు

దుమ్ముగూడెం: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లను చేశారు.నేటి నుండి 2025 జనవరి 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి స్వామి వారు మత్స్యావతారం, కూర్మావతారం, వరాహావతారం వంటి పలు అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. జనవరి 9వ తేదీన పవిత్ర గోదావరి నదీ తీరంలో తెప్పోత్సవం, 10వ తేదీన వైకుంఠదర్శనం నిర్వహించడానికి అధికారులు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. పర్ణశాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్ తెలిపారు.


ఆలయ ప్రాంగణంలో వేసిన టెంట్లు

గ్రంథాలయాన్ని ఆధునికీకరించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని తాతగూడి సెంటర్‌లోని గ్రంథాలయాన్ని సోమవారం జాతీయ మానవ హక్కుల సంఘం నూతన కమిటీ సభ్యులు సందర్శించారు. గ్రంథాలయం లోపలి సమస్యలను గురించి విద్యార్థులతో చర్చించారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ మామిడి పుల్లారావు, లైబ్రేరియన్ ఎస్‌కె.జానీ పలు సమస్యలప ఆరాతీశారు. వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్నటువంటి భవనము వర్షాకాలంలో పైకప్పు నుంచి లీకేజీ ఉందని, వెంటనే పాత భవనాన్ని తొలగించి రెండు అంతస్తుల నూతన భవనాన్ని నిర్మించాలని అన్నారు. గ్రంథాలయనికి కేటాయించిన స్థలంలో అన్ని వసతులతో కూడిన నూతన ఆడిటోరియం, మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. గ్రంథాలయం పరిసరాల పరిరక్షణకు నూతన కాంపౌండ్ వాల్‌ను నిర్మాణం చేయాలని, కాంపౌండ్ లేకపోవడంతో లోనికి పశువులు, కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు. గ్రంథాలయాల్లో 24 గంటల సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. జాతీయ మానహ హక్కుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్ సాయి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బాబు, భద్రాచలం మాజీ గ్రంథాలయ చైర్మన్ పుల్లారావు, లైబ్రేరియన్ ఎస్‌కె.జానీ పాల్గొన్నారు.

యోగాపై మక్కువ చూపాలి


దుమ్ముగూడెం: విద్యార్థులు యోగా నేర్చుకోవడం వల్ల ఒత్తిడిని జయించవచ్చని, ప్రతి ఒక్క విద్యార్థి యోగా పట్ల మక్కువ పెంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి సూచించారు. సోమవారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ లైఫ్ పొటెన్షియల్ హెల్ప్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హార్ట్ ఫుల్ నెస్ నోడల్ కోఆర్డినేటర్ సీతామహాలక్ష్మి విద్యార్థులకు టైమ్ ఆఫ్ ఇంపార్టెన్స్, టైం వాల్యూ, పరీక్షల కోసం విద్యార్థులు టైం ప్రకారం ఒత్తిడి లేకుండా ఎలా చదవాలి మొదలగు విషయాలను తెలియజేశారు. సీనియర్ తెలుగు అధ్యాపకులు వర రాజు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మల్లెల శ్రీనివాస్ రావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ప్రధాన సెంటర్‌లలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హిందూయిజం పేరుతో దేశంలో ఇప్పటికే అల్లకల్లోలం సృష్టిస్తున్న బీజేపీ.. అంబేడ్కర్‌పై విషం చిమ్ముతోందని నాయకులు విమర్శించారు. కాంగ్రెస్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


చంద్రుగొండ: నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు


భద్రాచలంఅర్బన్: ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు


దమ్మపేట: లింగాలపల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

నేడు 'డయల్ యువర్ డీఎం'

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో నేడు మంగళవారం డయల్ యువర్ డీపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం శ్యాంసుందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మణుగూరు డిపో పరిధిలోని పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం తదితర మండలాల ప్రజలు బస్ సర్వీసులపై నేటి మధ్యాహ్నం 3 గంటల నుంచి 4గంటల వరకు జరిగే కార్యక్రమం ద్వారా 9959225963 ఫోన్ నంబర్‌కి డయల్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని, సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని కోరారు.

ట్రాఫిక్ ఐలాండ్లు ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పట్టణంలోని ప్రధాన జంక్షన్లలో పోలీసులు ఐలాండ్లు (అంబరెల్లా)ను ఇప్పటికే 8 ఏర్పాటు చేయగా, నూతనంగా మరో 12 ఏర్పాటు చేశారు. పట్టణంలోని వివిధ జంక్షన్లలో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు.. వేసవి కాలంలో ఎండ వేడిని తట్టుకోవడానికి, వర్షా కాలంలో వర్షంలో తడవకుండా ఉపయోగపడే విధంగా ఈ ఐలాండ్లు ఉపయోగపడతాయి. కాగా వీటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకుని వచ్చి నిత్యం సిబ్బంది అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్లినిక్‌లలో తనిఖీ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మెడికల్ ప్రాక్టీషనర్లు డాక్టర్ అని చెప్పుకోకూడదని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ప్రియాంక్ సూచించారు. ఇటీవల ఎర్రగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన సురక్షా క్లినిక్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. క్లినిక్ అని డాక్టర్ అని రాసి ఉండటాన్ని గమనించిన ఆమె.. నిర్వాహకుడిని హెచ్చరించారు. ధ్రువపత్రం చూపించాలని కోరగా అందుబాటులో లేదనే నిర్వాహకుడు సమాధానం ఇచ్చాడు. దీంతో ధ్రువపత్రం తీసుకురావాలని, అప్పటి వరకు ఎలాంటి ప్రాథమిక చికిత్స చేయొద్దని ఆదేశించారు.

కార్మికులపై ఎస్మా ప్రయోగం సరికాదు

చర్ల: ఉత్తరప్రదేశ్, చండీఘడ్ రాష్ట్రాలలో విద్యుత్ సంస్థ ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్న విద్యుత్ రంగ కార్మికులపై అక్కడి ప్రభుత్వాలు ఎస్మా చట్టాలను ప్రయోగిస్తూ వేదింపులకు గురి చేస్తుండడం సరికాదని సీఐటీయూ పేర్కొంది.

సోమవారం చర్లలోని విద్యుత్ శాఖ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్, చండీఘడ్ ప్రభుత్వాల తీరును నిరశిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, రైతు సంఘం మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల మాయంపై విచారణ

అశ్వారావుపేటరూరల్: నిరుపేద మైనార్టీ మహిళలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పంపిణీ ఉచిత కుట్టు మిషన్ల లెక్కలో తేడాలు రావడంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మిషన్లు మాయం కావడంపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'కుట్టు మిషన్లు స్వాహా' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు విచారణకు అదేశించగా.. మిషన్ల స్వాహా వాస్తవమేనని ప్రాథమికంగా తేలింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచి ఉంచిన 83 కుట్టు మిషన్లలో 19 కుట్టు మిషన్లు మాయమైనట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు వివరాలను ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ 'సాక్షి'కి వెల్లడించారు. కుట్టు మిషన్లు మాయం ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కఠినంగా వ్యవహరిస్తామని, అన్నీ కోణాల్లో విచారణ చేస్తామన్నారు.

విచారణలో మరిన్ని వెలుగులోకి..

కుట్టు మిషన్ల మాయం ఘటనపై చేపట్టిన ప్రాథమిక విచారణలో ఇతర సామగ్రి సైతం స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విచారణలో 19 కుట్టు మిషన్లతోపాటు మిషన్లకు సంబంధించిన 49 మోటర్లు, 14 ఐరన్ స్టాండ్‌లు, 17 మిషన్ బల్లాలు కుడా మాయమైనట్లు తేలింది. వీటి విలువ సుమారు రూ.2లక్షల 50వేలు ఉంటాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో భద్రపరిచి ఉంచిన ఈ విలువైన కుట్టు మిషన్లు, సామగ్రి మాయం కావడంపై అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల హస్తం లేకుండా సాధ్యం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఓ మాజీ ప్రజాప్రతినిధితోపాటు, గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన అధికారి, కార్యాలయంలో పని చేసే కొంతమంది సిబ్బంది పాత్ర ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి సమగ్ర దర్యాప్తు చేస్తేనే అసలు విషయాలు బయటకు వస్తాయని లబ్ధిదారులు అంటున్నారు. మరో వైపు కుట్టు మిషన్లు, వాటికి సంబంధించిన సామగ్రి మాయంపై మైనార్టీ సంఘాలు గుర్రుమంటున్నాయి. మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేసేందుకు సిద్ధమౌతున్నట్లు తెలిసింది.


కుట్టు మిషన్లు, సామగ్రి వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, సిబ్బంది

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సాక్షి నెట్‌వర్క్: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ప్రకటనలు విడుదల చేశారు. నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలకు, వినోద భరిత ఈవెంట్ల కోసం ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వేడుకల పేరుతో టపాసులు పేల్చడం, మైకులు, డిజే సౌండ్స్ ఏర్పాటు చేయడం నిషేధమని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, ప్రజలకు ఇబ్బంది కరంగా బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడంపై చర్యలు తీసుకుంటామన్నారు. నూతన వేడుకలను అదునుగా తీసుకుని యువకులు, మైనర్లు ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, విన్యాసాలు చేస్తూ రోడ్లపై హల్చల్ చేస్తే చర్యలు తీసుకుంటామని, అదే విధంగా మైనర్ల కుటుంబ సభ్యులపై కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

క్షయపై అవగాహన


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న వంద రోజుల నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఎంజేపీటీబీసీ బాలికల, బాలుర వసతిగృహాల్లో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. 15రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట,, తేమడలో రక్తం పడడం, మెడ చుట్టూ, సంకలో గడ్డలు వంటి ప్రధాన లక్షణాలు ఉన్నట్లయితే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, నిర్ధారణ అయితే తగు మందులను వాడి వ్యాధిని నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజని, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, స్టాఫ్ నర్స్ సౌభాగ్య, రవి, భవాని, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి అమానుషం

అశ్వారావుపేటరూరల్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములపై మతోన్మాదులు భక్తి ముసుగులో దాడికి పాల్పడటం అమానుష చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు. పిట్టల అర్జున్ అన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాములు క్షమాపణ చెప్పినప్పటికీ అయ్యప్ప మాల ధరించిన విద్యార్థితోపాటు ఇతర స్వాముల కాళ్లకు మొక్కించడం హేయమైన చర్య అని అన్నారు. ఈ ఘటనను లౌకికశక్తులు తీవ్రంగా ఖండించాలని కోరారు. నాయకులు యేసు, నాగేంద్రరావు, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీఎస్ సెంటర్ ప్రారంభం

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌ను చైర్మెన్ చెవుల చందర్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్‌సీ జిల్లా మేనేజర్ అవులూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. డైరెక్టర్ పసుపులేటి వెంకటేశ్వర్లు, సీఈఓ లంక నర్సింహారావు, సిబ్బంది నాగేంద్రబాబు, నరేష్, శివ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

చంద్రుగొండ: మున్నూరు కాపుసంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎంపీడీఓ బయ్యారపు అశోక్ సోమవారం ఆవిష్కరించారు. దామరచర్ల గ్రామంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఓ వినయ్, సంఘం నాయకులు రామిసెట్టి సైదయ్య, వెలగల మధు, రాము, కృష్ణ, పూసాల లక్ష్మీపతి, భూపతి రమేష్, పులి సత్యం, మక్కా రమేష్, దయాకర్‌రావు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ

ములకలపల్లి: మండలపరిధిలోని తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను వితరణగా అందజేశారు. అడ్వకేట్ తాండ్ర వెంకట కృష్ణారావు, ఎన్నారై డాక్టర్ మురళీ కృష్ణారావు, డాక్టర్ పోట్లపల్లి రాజేందర్ దాతల సహకారంతో సైకిళ్లను కొనుగోలు చేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకట కృష్ణారావు చేతుల మీదుగా చిన్నారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, హెచ్ఎం శంకర్, పాఠశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ జలగం చంద్రశేఖర్, సభ్యులు మధుసూదన్, కాంతారావు, భాస్కర్, జోగయ్య, ఉపాధ్యాయులు నిర్మల, సురేశ్, ప్రశాంత్, ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ములకలపల్లి: ములకలపల్లిలో సంఘ మండల నాయకులు సూర్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కమిటీ సభ్యుడు రాంచరణ్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. సోహెల్, శృతి, అమృత, దివ్య తదితరులు పాల్గొన్నారు. అంజలి, శైలజ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.